www.prajapaksham.in
# ప్రజాపక్షం
ప్రతి అక్షరం ప్రజల కోసం
స్తంభాద్రి భద్రాద్రి
శనివారం | 28 | మార్చి | 2026 పేజీలు : 8

## నేడు సిపిఐ జిల్లా కార్యవర్గ సమావేశం

### -29న కౌన్సిల్

**ప్రజాపక్షం/ ఖమ్మం :** భారత కమ్యూనిస్టు పార్టీ ఖమ్మం జిల్లా కార్యవర్గ సమావేశం ఈనెల 28న మధ్యాహ్నం 1గంటకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభం కానుందని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ నేడొక ప్రకటనలో తెలిపారు. జిల్లా కౌన్సిల్ సమావేశం 29న ఉదయం 10 గంటలకు ఖమ్మం గిరిప్రసాద్ భవన్‌లో ప్రారంభమవుతుందన్నారు. ఈ సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం ఛైర్మన్ మహ్మద్ మౌలానా తదితరులు హాజరుకానున్నట్లు ఆయన తెలిపారు.



# సీతారాముల కళ్యాణం కమనీయం

- ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు సమర్పించిన ముఖ్యమంత్రి దంపతులు
- భక్తులతో కిక్కిరిసిన భద్రాద్రి



2 లో



## రూ. 351 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ



2 లో

## 10 మంది తహసీల్దార్లు బదిలీ

**ప్రజాపక్షం/ఖమ్మం :** జిల్లాలో 10 మంది తహసీల్దార్ల ను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. తల్లాడ తహసీల్దార్ కె. బ్రహ్మేశ్వర్‌రావును కల్లూరుకు, కల్లూరు తహసీల్దార్ సాంబశివుడును కలెక్టర్ కార్యాలయంకు బదిలీ చేస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. సింగరేణి తహసీల్దార్ ఎం. వినయేందర్‌రెడ్డిని ఖమ్మం రూరల్ తహసీల్దార్‌గా, ఖమ్మం రూరల్ తహసీల్దార్‌ను నేలకొండపల్లి తహసీల్దార్‌గా, నేలకొండపల్లి తహసీల్దార్ వెంకటేశ్వర్లును సింగరేణి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. చింతకాని తహసీల్దార్ డి. జయచందర్‌ను ఖమ్మం అర్బన్ తహసీల్దార్‌గా, ఖమ్మం అర్బన్ తహసీల్దార్ సైదులును కూసుమంచి తహసీల్దార్‌గా బదిలీ చేశారు. కూసుమంచి తహసీల్దార్ రవిని ముదిగొండ తహసీల్దార్‌గా బదిలీ చేయగా ముదిగొండ తహసీల్దార్ ఎలిజిబెత్ ను ఖమ్మం కలెక్టర్ కార్యాలయంకు బదిలీ చేశారు. డిప్యూటేషన్‌పై కారేపల్లిలో పనిచేస్తున్న ఎ. రమేష్‌ను తిరిగి సబ్ కలెక్టర్ కార్యాలయం కల్లూరుకు బదిలీ చేస్తూ అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) పి. శ్రీనివాసరెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

### సీతారాముల కళ్యాణం
# లోక కళ్యాణానికి ప్రతీక



- పండుగను ఘనంగా నిర్వహించుకోవడం సంతోషం
- రామయ్య ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి
- ఎంఎల్‌ఏ కూనంనేని

**ప్రజాపక్షం/కొత్తగూడెం :** సీతారాముల కళ్యాణ లోక కళ్యాణానికి ప్రతీకని కొత్తగూడెం ఎంఎల్‌ఏ కూనంనేని సాంబశివరావు అన్నారు. శ్రీరామ నవమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం నియోజకవర్గ వ్యాప్తంగా ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పలు మండపాలు, దేవాలయాలను సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా, మేయర్ మూడ్ గణేష్‌తో కలిసి సందర్శించి సీతారాముల కళ్యాణోత్సవాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ

మిగతా 2లో..

# సీతారాముల కళ్యాణం కమనీయం









**ప్రజాపక్షం/భద్రాచలం :** దక్షిణ అయోధ్య భద్రగిరిలో శుక్రవారం నిర్వహించిన శ్రీసీతారాముల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. లోక కళ్యాణార్థం జరిగిన ఈ వేడుకను కనులారా తిలకించిన భక్తజనం పులకించారు. అభిజిత్ లగ్నంలో వేదపండితుల శాస్త్రోచ్ఛరణల నడుమ రామయ్య తండ్రి సీతమ్మ వారి మెడలో మాంగళ్యధారణ చేశారు. ఈ అద్భుత ఘడియల్లో భక్తుల రామనామ స్మరణతో మిథిలా స్టేడియం భక్తిభావంతో తొణికిసలాడింది. ఈ వేడుకలో భాగంగా ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి దంపతులు ప్రభుత్వం తరఫున ముత్యాల తలంబ్రాలు, పట్టువస్త్రాలు భక్తిశ్రద్ధలతో సమర్పించారు. తెల్లవారు ఝామున 2 గం.లకు ఆలయాన్ని తెరిచి సుప్రభాత సేవ చేసారు. అనంతరం తిరువారాధన జరిపించారు. 4 గం.ల నుండి 5 గం.ల వరకు మూలమూర్తులకు అభిషేక క్రతువు జరిగింది. ముహూర్తపు ఘడియలు సమర్పిస్తుండగా గర్భగుడిలో కళ్యాణమూర్తులను పట్టువస్త్రాలతో అలంకరించి ప్రత్యేక పల్లకీలో మిథిలా పండపానికి మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొచ్చారు. మిథిలా వేదికలో క్రిక్కిరిసిన భక్తజన సందోహం నడుమ ఉ.10.30 గం.లకు వేదమంత్రోశ్చరణ అర్చకులు కళ్యాణఘట్టాన్ని ప్రారంభించారు. ప్రభుత్వం తరుపున ముఖ్యమంత్రి దంపతులు ముత్యాల తలంబ్రాలు, పట్టవస్త్రాలు సమర్పించారు. ముందుగా ముఖ్యమంత్రి దంపతులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. కళ్యాణ క్రతువులో భాగంగా తిరుకళ్యాణానిక సంకల్పం పలికి విశ్వక్షేణపూజ, ఆరాధన నిర్వహించి కళ్యాణానికి ఉపయోగించే సామాగ్రికి సంప్రోక్షణ చేసిన అనంతరం రక్షాబంధనం నిర్వహించి యోక్త్రధారణ చేశారు. 12 దర్భాలతో ప్రత్యేకంగా అల్లిన తాడును సీతమ్మవారి నడుముకు అలంకరించారు. ఈ తాడును అలంకరించడం వల్ల గర్భదోషాలు తొలుగుతాయని శాస్త్రం చెబుతోంది. సీతారాములకు రక్షాబంధన కట్టి స్వామి గృహస్తధర్మం కోసం యజ్ఞోపవిచరణ చేసిన కన్యావరుణ అనంతరం తాంబూలాది సత్కారాలు అందించారు. శ్రీరామునికి సీతమ్మ తగిన వధువని పెద్దలు నిర్ణయించి ఇరువంశాల గోత్రాలను పఠించారు. భక్తరామదాసు చేయించిన పచ్చలహారం సహా పలు ఆభరణాలను స్వామికి, అమ్మవారికి అలంకరించారు. కళ్యాణ వైభవాన్ని చాటి చెప్పేలా చూర్ణికలను పఠించిన అనంతరం వేదమంత్రోశ్చరణలు మార్మోగుతుండగా జీలకర్ర, బెల్లం మిశ్రమాన్ని సీతారాముల శిరస్సులపై ఉంచారు. ఈ లోక కళ్యాణాన్ని కనులారా వీక్షించి భక్తులు తన్మయత్వానికి లోనయ్యారు. లోకమంతా ఎదురు చూస్తుండగా సీతమ్మవారి మెడలో శ్రీరామ చంద్రుడు మాంగళ్యధారణ చేశారు. పెద్ద సంఖ్యలో తరలివచ్చిన రామనామస్మరణ మధ్య జగదభిరాముడు జానకమ్మను మనువాడారు. రాముడు దోసిట తలంబ్రాలు నీలపురాసులుగా జానకీ దోసిట తలంబ్రాలు మణిమాణిక్యాలై సాక్షత్కరించిన వేళ మిథిలా మైథానం భక్తపారవశ్యంలో ఓలలాడింది. తిరుమల తిరుపతి దేవస్థానం సీతారాములకు పట్టువస్త్రాలు సమర్పించారు. శ్రీరామ నవమి సందర్భంగా కళ్యాణ కాంతులతో కళకళ్లాడిన శ్రీరామచంద్రునికి శనివారం పట్టాభిషేక మహోత్సవం జరగనుంది. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లుభట్టి విక్రమార్క, ఇంచార్జ్ మంత్రి వాకటి శ్రీహరి, మంత్రులు కొండా సురేఖ, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, దనసరి అనసూయ (సీతక్క),మహబూబాబాద్ ఎంపి పోరిక బలరాం నాయక్, న్యాయమూర్తులు, ఎండోమెంట్ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా అయ్యర్, ఎండోమెంట్ కమీషనర్ హన్మంతరావు, జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్పి రోహిత్ రాజ్, ఐటిడిఏ పిఓ రాహుల్, అదనపు కలెక్టర్లు వేణుగోపాలరావు, విద్యాచందన, సబ్ కలెక్టర్ మ్రినాల్ శ్రేష్ఠ, ఎంఎల్సిలు, ఎంఎల్ఏలు డా.తెల్లం వెంకట్రావు, కూనంనేని సాంబశివరావు, పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్యతో పాటు పలువురు పాల్గొన్నారు.

## రూ. 351 కోట్ల అభివృద్ధి పనులకు భూమి పూజ

**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం దివ్యక్షేత్రాభివృద్ధిలో భాగంగా రూ.351 కోట్ల నిధులతో తొలిదశ అభివృద్ధి పనులకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం భూమి పూజ చేశారు. రామాలయ అభివృద్ధి విస్తరణ పనులకు గానూ ప్రభుత్వం ఇటీవల మూడు దశల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు రూ.586 కోట్లను కేటాయించిన విషయం విధితమే. కాగా తొలిదశ పనులకు రూ.351 కోట్లను వెచ్చించనున్నారు. ఇందు కోసం మాస్టర్ ప్లాన్ సిద్ధమైంది. రూ.75 కోట్లతో గోదావరిఘాట్ విస్తరణ పనులు, మౌళిక సదుపాయాల ఏర్పాటు,మరో రూ.180 కోట్లతో అలయ చుట్టు ప్రకారాలు, కాంప్లెక్స్ పనులు, రూ.96 కోట్లతో రామాలయ పరిసరాలను అభివృద్ధి చేయనున్నారు. ఈ పనులు వచ్చే ఏడాది శ్రీరామ నవమి నాటికి పూర్తి చేసేలా ప్లాన్ సిద్ధం చేస్తున్నారు. మిగతా పనులు 2029 నాటికి పూర్తి చేసేందుకు ప్రణాళికలు చేశారు.

## నేడు స్వామికి పట్టాభిషేకం

### - గవర్నర్ రాక

**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారామ చంద్రస్వామి వారికి నేడు పట్టాభిషేక మహోత్సవాన్ని శనివారం నిర్వహించనున్నారు. ఈ మేరకు దేవస్థానం ఆధ్వర్యం అన్ని ఏర్పాట్లు చేశారు. రాజాధిరాజు ప్రత్యేక వాహనంపై కళ్యాణ మండపానికి చేరుకుంటారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్ల హాజరుకానున్నారు. ఈ మేరకు ఆయన ప్రత్యేక హెలీక్రాప్టర్‌లో హైదరబాద్ నుండి నేడు భద్రాచలం చేరుకుంటారు.

## కొత్తగూడెం రైల్వే డివిజన్ ఏర్పాటు చేయండి

### -రైల్వే మంత్రికి వద్దిరాజు వినతి

**ప్రజాపక్షం/ ఖమ్మం :** కొత్తగూడెం నగరం కేంద్రంగా కొత్త రైల్వే డివిజన్‌ను ఏర్పాటు చేయాలని బిఆర్ఎస్ నాయకులు, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర విజ్ఞప్తి చేశారు. రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌ను కలిసి ఈ మేరకు వినతి పత్రం సమర్పించారు. కొత్తగూడెం (భద్రాచలం రోడ్డు) రైల్వే స్టేషన్ ఏర్పడి వందేళ్లు కావస్తున్న సందర్భంగా కొత్త రైల్వే డివిజన్ ఆవశ్యకతను ఈ సందర్భంగా రైల్వే మంత్రికి ఆయన వివరించారు. ఈ ప్రాంత చారిత్రిక నేపథ్యం, ప్రజల అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం కేంద్రంగా రైల్వే డివిజన్‌ను నెలకొల్పాలని ఆయన కోరారు. వినతి పత్రం సమర్పించిన వారిలో బిఆర్ఎస్ పార్లమెంటరీ నేత సురేష్‌రెడ్డి ఉన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు



**ప్రజాపక్షం/పెనుబల్లిః** శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారామ కల్యాణ మహోత్సవాన్ని పెనుబల్లి మండలంలో అంగరంగ వైభోగంగా నిర్వహించారు. పెనుబల్లి గ్రామంలో శ్రీ కోదండ రామ స్వామి ఆలయంలో, శ్రీ కుభేర అంజనేయ స్వామి మందిరంలో, విఎం బంజర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో ఇతర గ్రామాలలోని రామాలయాలలో వేద పండితులు మంత్రాలతో, మంగళ వాద్యాలతో శుభ ముహర్తన సీత రామ కళ్యాణం ఘనంగా నిర్వహించారు. కళ్యాణ శోభతో రామాలయాలు, రామ కళ్యాణ మహోత్సవ మండపాలను చలువ పందిర్లు వేసి అలంకరించారు. సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించేందుకు భక్తులు, ఆలయాలకు భారీగా చేరుకొని కల్యాణ మహోత్సవ వేడుకను కనులారా తిలకించారు. పెనుబల్లి విఎం బంజర్ గ్రామాలలోని కోదండ రామస్వామి ఆలయం, శ్రీ కుబేర ఆంజనేయ స్వామి మందిరం, అభయ ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి సందర్భంగా జరిగిన సీతారామ కళ్యాణ మహోత్సవానికి సత్తుపల్లి మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, పెనుబల్లి మండల బిఆర్ఎస్ నాయకులు కోటగిరి సుధాకర్ బాబుతో కలిసి సీతారామ కళ్యాణ మహోత్సవాన్ని తిలకించారు. భక్తులు భక్తి శ్రద్ధలతో వడపప్పు పానకాన్ని సేవించి అనంతరం పెనుపల్లి రామాలయంలో చేసిన అన్న మహా ప్రసాదాన్ని స్వీకరించారు.

## ఉచిత పులిహోరా, మజ్జిగ పంపిణీ



**ప్రజాపక్షం/భద్రాచలం :** సినీ గేయ రచయిత చంద్ర బోస్ అభిమాన సంఘం ఆధ్వర్యంలో శ్రీ రామ నవమిని పురస్కరించుకుని శుక్రవారం రామర భక్తులకు ఉచితంగా పులిహోరా, మజ్జిగ పంపిణీ చేసారు. ఈ కార్యక్రమాన్ని స్థానిక యూబి సెంటర్ కూడలిలో పిఆర్‌టియూ రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు దనికొండ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీగేయ రచయిత చంద్రబోస్ అభిమానం సంఘంతో గతకొన్నేళ్ల పాటు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీరామ నవమి సందర్భంగా ఇతర ప్రాంతాల నుండి వచ్చిన 2వేల మంది భక్తుల ఉచితంగా పులిహోరా, మజ్జిగ పంపిణీ చేయడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రబోస్ అభిమాన సంఘం రాష్ట్ర నాయకులు తోటమల్ల సురేష్ బాబు, కుప్పాల నాగరాజు, కర్ర అనీల్ రెడ్డి, గుమ్మడపు దుర్గా ప్రసాద్, తోటమల్ల బాలయోగి, హేమంత్ శ్రీ, గణేష్, శ్యామ్ శ్రీ, సాయి, మణికంఠ, భాను, తోటమల్ల శ్రావణి, లక్ష్మి పాల్గొన్నారు.

## సీతారాముల కళ్యాణం లోక కళ్యాణానికి ప్రతీక



(మొదటిపేజీ తరువాయి) మన పూర్వీకులు అందించిన సంప్రదాయాలను గౌరవిస్తూ పండుగలను ఇంత ఘనంగా నిర్వహించుకోవడం ఎంతో సంతోష కరమన్నారు. శ్రీరామనవమి వేడుకలు సమాజంలో సోదర భావాన్ని, ఐఖ్యతను పెంపొందిస్తాయని అభిప్రాయపడ్డారు. భక్తి భావంతో జరుపుకునే ఇటువంటి పండుగలు ఒత్తిడిని తగ్గించి మానసిక ప్రశాంతతను అందిస్తాయని చెప్పారు. నియోజకవర్గ ప్రజలంతా శ్రీరామ చంద్రుని కృపతో సుఖసంతోషాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ వేడుకలు విజయవంతానికి మండపాలు, దేవాలయాల వద్ద ఉత్సవ కమిటీలు చేసిన కృషి అభినందనీయమని కొనియాడారు. భద్రాద్రి రామయ్య నియోజకవర్గ ప్రజలందరికీ ఎల్ల వేళాలా ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం ప్రసాద పంపిణీ ప్రారంభించారు. మండపాలు, ఆలయన సందర్శన అనంతరం ఆయన నేరుగా భద్రాచలంలో జరిగిన శ్రీరామ నవమి ఉత్సవంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# అన్నదాతకు ఆరుగాలం.. భరోసా అంతా గాలిలోనే..!



-ఎన్నికల హామీలకు, క్షేత్రస్థాయి అమలుకు పొంతన లేని వైనం
-కోత దశలో పెట్టుబడి సాయం..
విడతల వారీగా జమతో రైతుల అసహనం

ప్రజాపక్షం/నేలకొండపల్లి : గోడ మీద పిల్లి.. అటు కుదురుతుందో, ఇటు పడుతుందో అన్నట్లుగా ఉంది రాష్ట్రంలో రైతు భరోసా పరిస్థితి. ఎన్నికల ముందు ఆకాశమే హద్దుగా హామీలు గుప్పించిన సర్కార్, తీరా అమలు సమయానికి వచ్చేసరికి చేతులెత్తేస్తోంది. ఎకరాకు రూ. 15,000 ఇస్తామని ఆశపెట్టి, ఇప్పుడు అత్తెసరు నిధులతో చేతులు దులుపుకుంటోంది. ఖమ్మం జిల్లావ్యాప్తంగా లక్షలాది మంది రైతులు పెట్టుబడి సాయం కోసం కళ్లు కాయలు కాచేలా ఎదురుచూస్తుంటే, ప్రభుత్వం మాత్రం కేవలం "ఎకరం పైసలతోనే" సరిపెట్టి భరోసాను ముక్కలు ముక్కలు చేస్తోంది.

**సీజన్ ముగింపులో సాయమా..?**

సాధారణంగా రైతుకు పెట్టుబడి సాయం అనేది విత్తనాలు, ఎరువులు కొనే అక్టోబర్, నవంబర్ నెలల్లో అందాలి. అప్పుడే రైతుకు ప్రైవేటు అప్పుల బాధ తప్పుతుంది. కానీ, ప్రస్తుతం యాసంగి సీజన్ ముగింపు దశకు చేరుకుంది. పంటలు కోతకు వస్తున్నాయి. ఈ తరుణంలో మార్చి 22న నిధులు విడుదల చేయడంపై రైతాంగం తీవ్రంగా మండిపడుతోంది. పంట చేతికొచ్చేటప్పుడు ఇచ్చేది పెట్టుబడి సాయం ఎలా అవుతుంది..? ఇది కేవలం ఎన్నికల తూతూమంత్రం తప్ప మరొకటి కాదు" అని అన్నదాతలు సూటిగా ప్రశ్నిస్తున్నారు.

**ఎకరాకు రూ. 6 వేలే జమ.. మిగిలినవి ఎప్పుడు..?**

ఖమ్మం జిల్లాలో సుమారు 3.58 లక్షల మంది రైతులకు భరోసా అందాల్సి ఉండగా, ప్రభుత్వం వింత పోకడకు శ్రీకారం చుట్టింది. రైతుకు ఎన్ని ఎకరాల భూమి ఉన్నా, ప్రస్తుతానికి కేవలం ఒక ఎకరానికి (రూ. 6,000) మాత్రమే ఖాతాల్లో జమ చేశారు. రెండో ఎకరానికి 20 రోజుల తర్వాత, మిగిలిన మొత్తాన్ని ఏప్రిల్ నెలాఖరున ఇస్తామని అధికారులు చెబుతున్నారు.

**నమ్మకం లేని రైతులు...**

గతంలో సాంకేతిక లోపాలు, క్లరికల్ తప్పులు అని చెప్పి వేలాది మందికి నిధులు ఎగవేసిన చేదు అనుభవాల దృష్ట్యా, ఈ విడతల వారీ హామీలను రైతులు ఏమాత్రం నమ్మలేకపోతున్నారు.

**నిబంధనల పేరుతో కోతలు..!**

ఈసారి కూడా క్రాప్ బుకింగ్ పేరుతో పెద్ద ఎత్తున కోతలు విధిస్తారేమోనన్న భయం అన్నదాతల్లో వ్యక్తమవుతోంది. ఎన్నికల హామీ ప్రకారం ఏడాదికి రూ.15,000 ఇవ్వాల్సింది పోయి, దానిని రూ. 12,000కు కుదించడం ఒక ఎత్తయితే.. ఆ మొత్తాన్ని కూడా వాయిదాల పద్ధతిలో ఇస్తూ రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది సర్కార్, పంట పెట్టుబడి కోసం ఇప్పటికే ప్రైవేటు వడ్డీ వ్యాపారుల దగ్గర వేలాది రూపాయలు అప్పులు చేసి, ఇప్పుడు పంట అమ్ముకునే సమయంలో ప్రభుత్వం ఇచ్చే ఈ కొద్దిపాటి సాయం దేనికి సరిపోదని రైతులు వాపోతున్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, ఎకరా నిబంధనలు తొలగించి, రైతులకు రావాల్సిన పూర్తి స్థాయి భరోసా నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్నారు. లేని పక్షంలో అన్నదాతల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరిస్తున్నారు.

**పెట్టుబడి ముగిశాక ఇచ్చే ఆరు వేలు దేనికి?**

**పొల్రెడ్డి శ్రీనివాస్‌రావు, మంగాపురం**



నాకు మూడు ఎకరాల పొలం ఉంది. అక్టోబర్లోనే అప్పు తెచ్చి విత్తనాలు, మందులు కొన్నాను. అప్పు ఇచ్చినోడు వడ్డీ కోసం ఇంటి చుట్టూ తిరుగుతున్నాడు. ఇప్పుడు మార్చి చివర్లో నా ఖాతాలో రూ. 6 వేలు పడ్డాయి. 3 ఎకరాలకు 18 వేలు రావాలి. ఒకేసారి డబ్బులొస్తే అప్పులో సగమైనా తీరేది. ఈ ఆరు వేలు ఎటూ కాకుండా పోతాయి. మిగిలినవి ఎప్పుడిస్తారో గ్యారెంటీ లేదు.

**ముందే ఇస్తే ఈ రంది ఉండేది కాదు..**

**గుగులోతు వీరు నాయక్, ముతాపురం**



ఇదివరకు సీజన్ మొదలయ్యే నాటికే బ్యాంకులో మెసేజ్ వచ్చేది. ఆ డబ్బులతోనే ధీమాగా దుక్కులు దున్నుకునేటోళ్లం. ఇప్పుడు అసలు వస్తయో.. రావో అన్న టెన్షన్. తీరా ఇచ్చినా ఇలా ముక్కలు ముక్కలుగా ఇస్తున్నారు. పది ఎకరాలున్న వాడికి, అర ఎకరం ఉన్న వాడికి ఒకేసారి ఆరు వేలు వేయడం ఏ రకమైన న్యాయం? ఈ వాయిదాల పద్ధతి మాకు వద్దు.

# చైతన్య పరిచిన శ్రీ చైతన్యోత్సవ్-2026




- హేమచందర్ పాటలతో విద్యార్థుల్లో ఉత్సాహం
- సాంకేతికత-సాంస్కృతిక సమ్మేళనంగా వేడుక

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఖమ్మంరూరల్ మండలంలోని పొన్నెకల్లు పంచాయతీపరిధిలోని శ్రీచైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో శ్రీ చైతన్యోత్సవ్2026 పేరుతో రెండురోజుల పాటు నిర్వహించిన కలర్స్ ఆఫ్ సెలబ్రేషన్ థీమ్ విద్యార్థులను చైతన్య పరిచింది. ఈ వేడుకకు హాజరైన విద్యవేత్తలు చేసిన ప్రసంగాలు విద్యార్థులకు సాంకేతికత మేధస్సును ఇవ్వగా.. సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహాన్ని ఇచ్చాయి. ప్రధానంగా గాయకుడు హేమచందర్ పాటలు విద్యార్థులను అలరించాయి. రెండు గంటలపాటు పాడిన పాటలతో విద్యార్థులు నృత్యాలు చేస్తూ కేరింతలు పెట్టారు. అలాగే తెలంగాణ స్టేట్ టెక్నికల్ ఎడ్యుకేషన్‌బోర్డు చైర్మన్ పుల్లయ్య హాజరయ్యి విద్యార్థులను ఉద్దేశించి అద్భుతమై ప్రసంగాన్ని చేశారు. ఈ ఇవెంట్ ఆద్యంతం సాంకేతికసంస్కృతిక సమ్మేళనంగా విద్యార్థులలో ఓ నూతన ఉత్తేజం, విద్య పట్ల మక్కువను రుచిచూపించాయి. ఈ కార్యక్రమాలలో కళాశాల చైర్మన్ మల్లెంపాటి శ్రీధర్, కళాశాల డైరెక్టర్ రావ్‌తేజ్, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సాయిగీతిక, డైరెక్టర్ శ్రీవిద్య, తాన ప్రతనిధి జయశేఖర్, బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ సభ్యులు డాక్టర్ పన్నాల కృష్ణమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మి నారాయణ, డీజీఎం చేతన్, అకాడమిక్ డీన్ డాక్టర్ సుదర్శన్, ఏవో వైశాలి, ట్రైనింగ్ అండ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాజేష్, డిప్లొమా ఇంచార్జి కృష్ణ ప్రసాద్, ఏజీఎంలు బ్రహ్మం, గోపాల్ కృష్ణ, వర్ధమాన నటుడు కిషోర్‌దాస్, సిని హీరో తల్లాడ సాయికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గ్రామీణ వైద్యుడికి ఉంగరం బహూకరణ

ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీకి చెందిన రైతు, వైరా మేజర్ గ్రామ పంచాయతీ మాజీ ఉప సర్పంచ్ తాండ్ర పెద్ద బ్రహ్మం తనకు చేసిన వైద్యసేవకు గండగలపాడు గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు పూర్ణకంటి దాసుకు బంగారు ఉంగారాన్ని రూ.54వేలు బహూకరించి తన దయా హృదయాన్ని చాటుకున్నారు. గత ఏడేళ్ల క్రితం షుగర్ రావడంతో కాలుకు గాయమై బాధపడుతున్న తరుణంలో తనకు అనేక సేవలు చేసిన దాసు సేవలను గుర్తించి శాలువాతో సన్మానించి బంగారు ఉంగరాన్ని బహూకరించారు. ఈ కార్యక్రమంలో తాండ్ర బ్రహ్మం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



## సంస్కృతీ సంప్రదాయాలను కొనసాగిద్దాం





ప్రజాపక్షం/మధిర : అన్ని పండుగలు కలిసికట్టుగా జరుపుకుని మతసామరస్యాన్ని చాటడంతో పాటు భారతీయ సంస్కృతిని, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని మధిర మున్సిపల్ చైర్‌పర్సన్ సామినేని సుజాత రామనాథం సూచించారు. శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా మధిర మున్సిపాలిటీ పరిధిలోని ఇల్లెందులపాడు అభయ ఆంజనేయస్వామి ఆలయంలో జరిగిన సీతారాముల కళ్యాణ వేడుకల్లో చైర్మన్ దంపతులు పాల్గొని భక్తులకు శుభాకాంక్షలు తెలిపారు. ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేసిన పానకం పంపిణీ, అన్నదాన కార్యక్రమాలను చైర్పర్సన్ సుజాత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ సోదర భావంతో మెలగాలని, నవమి ఉత్సవాలు ధనిక, పేద, కుల, వర్గ తారతమ్యం లేకుండా ప్రజలందరిని ఏకం చేశాయని అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి జిల్లా కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కాంగ్రెస పార్టీ అధికార ప్రతినిధి కర్నాటి రామారావు, మండల కార్యదర్శి సూర్యదేవర కోటేశ్వరరావు, బోడేపూడి గోపినాథ్, వాసిరెడ్డి నాగేశ్వరరావు, చావా సత్యనారాయణ, మల్లాది హన్మంతరావు, ఆలయ కమిటీ చైర్మన్ నీరుకొండ సుభాష్‌బాబు, మన్యంపల్లి ర్యతకుమారి పాల్గొన్నారు.

## సింగరేణి సెక్యూరిటీ జమేదార్‌కు ఘన సన్మానం



ప్రజాపక్షం/సత్తుపల్లి: సింగరేణి సత్తుపల్లి ఏరియా జలగం వెంగళరావు ఉపరితల గనిలో సెక్యూరిటీ జమేదర్ గా విధులు నిర్వర్తించి, మణుగూరు జూనియర్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొంది శుక్రవారం బదిలీపై వెళ్తున్న సింగరేణి జమేదార్ బండెల విజేందర్ ను జే.వి.ఆర్ సి రిలే ప్రైవేట్ సెక్యూరిటీ గార్డ్ లు శుక్రవారం ఘనంగా సన్మానించి, జ్ఞాపిక అందజేశారు. ఈ సందర్భంగా విజేందర్ ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పట్ల వ్యవహరించిన తీరును జ్ఞప్తికి తెచ్చుకొని భావోద్వేగానికి లోనయ్యారు. ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది విధులు నిర్వర్తించే ప్రాంతాలలో వసతుల కల్పన, సిబ్బందికి సమస్యల పరిష్కారం పట్ల జమేదర్ విజేందర్ వ్యవహరించిన తీరును ప్రైవేట్ సిబ్బంది ప్రశంసించారు. జూనియర్ ఇన్స్పెక్టర్ గా పదోన్నతి పొందిన విజేందర్ మరిన్ని పదవులు అధిరోహించి ఉన్నత స్థానానికి ఎదగాలని ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సింగరేణి సెక్యూరిటీ యాక్టింగ్ జమిందార్ ఎన్. శ్రీనివాసరావు, సీనియర్ సెక్యూరిటీ గార్డులు కనకయ్య, బాలకిషన్, ఈ. శ్రీనివాసరావు, ప్రవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్ కొక్కెర గద్ద నగేష్ అధిక సంఖ్యలో సి రిలే ప్రైవేట్ సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఒంటిపూట బడుల సమయపాలన పెంచడం సమంజసం కాదు




ప్రజాపక్షం/పెనుబల్లి: పెనుబల్లి మండలం స్థానిక ప్రభుత్వ పాఠశాలలకు వేసవిలో ఇచ్చే ఒంటిపూట బడుల సమయపాలనను పెంచడానికి భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఖండించింది. శుక్రవారం పెనుబల్లి కేంద్రంగా నిర్వహించిన సమావేశంలో జిల్లా కార్యదర్శి తుడుం ప్రవీణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా కేవలం పెనుబల్లి మండలంలోని విద్యార్థులకు ఒంటిపూట బడుల సమయపాలన పెంచడం సరైనది కాదని, ఎండ తీవ్రత ఎక్కువగా ఉన్న సమయంలో అలాగే దగ్గరలో ఉన్నటువంటి సింగరేణి బొగ్గు గనుల నుండి వచ్చే వేడి వలన గాని ఈ వేసవిలో వచ్చే వడగల్పుల వలన విద్యార్థులకు నష్టం కలుగుతుందన్నారు. కనుక రాష్ట్రంలో ఏ విధంగా అయితే నిర్వహిస్తున్నారో అదేవిధంగా పెనుబల్లి మండలంలో కూడా వంటి పూట బడుల సమయపాలన నిర్వహించాలని వెంటనే దీనిపై విద్యాశాఖ ఉన్నతఅధికారులు స్పందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు వంకాయల రాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు బెజవాడ సాయి శేషు, సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు భూక్య బాలాజీ నాయక్, డివిజన్ నాయకులు తురక అన్వేష్, ఎర్రబది ప్రవీణ్ కుమార్, మెచ్చు కార్తీక్ పాల్గొన్నారు.

## అక్రమ అరెస్టులతో ఆశావర్కర్ల ఉద్యమాన్ని ఆపలేరు



ప్రజాపక్షం/బోనకల్ : తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం చలో హైదరాబాద్ కార్యక్రమానికి తరలివెళ్తున్న ఆశా వర్కర్ల అక్రమ అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరని సిఐటియు జిల్లా నాయకులు బోయినపల్లి వీరబాబు, మండల కన్వీనర్ గుగులోతు నరేష్ అన్నారు. శుక్రవారం బోనకల్‌లో అక్రమ అరెస్టులకు నిరసనగా ధర్నా నిర్వహించి అధికారులకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందచేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ప్రస్తుత కాంగ్రెస్ పార్టీ ఆశా వర్కర్ల వేతనం పెంచుతామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని హామీ ఇచ్చి ఆ హామీలను నిలబెట్టుకోకుండా నిర్లక్ష్యం వహిస్తుందన్నారు. ఆశాల సమస్యలపై 28న నిర్వహించనున్న చలో హైద్రాబాద్ కార్యక్రమానికి వెళ్తున్న ఆశా వర్కర్ల యూనియన్ డివిజన్ కార్యదర్శి రామన సరోజిన్ని అరెస్టు చేయటం దుర్మార్గమైన చర్య అని, వెంటనే సరోజిన్ని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఆశాల సమస్యలు పరిష్కరించేంత వరకు ఉద్యమం ఆగదన్నారు. ఈకార్యక్రమంలో రైతు సంఘం మధిర డివిజన్ కార్యదర్శి దొండపాటి నాగేశ్వరరావు, జిల్లా నాయకులు కిలారి సురేష్, మండల అధ్యక్షులు కొమ్మినేని నాగేశ్వరరావు, మహిళా సంఘం డివిజన్ అధ్యక్షులు జొన్నలగడ్డ సునీత, వ్య.కా.సం మండల అధ్యక్షులు కార్యదర్శి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

## మహిళ ప్రాణాలు కాపాడిన జవాన్





ప్రజాపక్షం/కారేపల్లి : సింగరేణి మండలం పొలంపల్లి గ్రామానికి చెందిన భారత సైనికుడు బానోత్ దశరథ్ మానవత్వాన్ని చాటుతూ మరో సారి ప్రశంసలు అందుకున్నారు. ప్రస్తుతం లేహ్..లడాక్ ప్రాంతంలో విధులు నిర్వర్తిస్తున్న ఆయన, అక్కడి సోనం హాస్పిట ల్‌లో చికిత్స పొందుతున్న మహిళలకు అత్యవసరంగా ఏబీ పాజిటివ్ రక్తం అవసరం ఏర్పడిన విషయం తెలుసుకుని వెంటనే స్పందించారు.ఆసుపత్రికి చేరుకుని స్వచ్ఛందంగా రక్తదానం చేయడంతో ఆ మహిళకు తక్షణ చికిత్స అందించి ప్రాణాలు కాపాడగలిగారు. ఈ సేవకు తోటి సైనికులు, అధికారులు, సోనం హాస్పిటల్ వైద్యులు ఆయనను అభినందించి అప్రిసియేషన్ సర్టిఫికేట్ అందజేశారు. ఇప్పటికే గణతంత్ర దినోత్సవం సందర్భంగా బెస్ట్ సోల్జర్ అవార్డు అందుకున్న దశరథ్, దేశ సేవతో పాటు మానవ సేవలోనూ ముందుండటం గర్వకారణమని పొలంపల్లి గ్రామస్థులు, ఖమ్మం జిల్లా ప్రజలు అభినందిస్తున్నారు.

## ట్రాక్టర్ రివర్స్ పోటీలు ప్రారంభం



ప్రజాపక్షం/ ఎర్రుపాలెం : ఎర్రుపాలెం మండలంలోని వెంకటాపురం గ్రామంలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా దేవస్థానం కమిటీ ఆధ్వర్యంలో ట్రాక్టర్ రివర్స్ పోటీలను గ్రామ సర్పంచ్ బొగ్గుల గోవర్ధన్‌రెడ్డి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు మండల అధ్యక్షులు కర్నాటి సుధాకర్‌రెడ్డి, మాజీ సొసైటీ అధ్యక్షులు కృష్ణారెడ్డి, గ్రామ పెద్దలు వేముల వెంకటేశ్వరరావు, బూసుపల్లి వెంకటరెడ్డి, గౌర్రాజు రమేష్, పాలకవర్గ సభ్యులు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రన్‌ఫర్ జీసస్ ర్యాలీ పోస్టర్ ఆవిష్కరణ



ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఏప్రిల్ 4వ తేదీన ఖమ్మంలో ప్రపంచశాంతి కోసం నిర్వహించనున్న రన్‌ఫర్ జీసస్ ర్యాలీ పోస్టర్‌ను ఏదులాపురం మున్సిపాలిటీలోని బిషప్ హౌజ్‌లో శుక్రవారం ఆవిష్కరించారు. ఈ పోస్టర్ ప్రత్యేక ప్రార్థన నడుమ బిషప్ సగిలి ప్రకాష్, ఖమ్మం నగరంలోని ప్రముఖ క్రైస్తవ ఫాస్టర్స్ ఫెలోషిప్ అధ్యక్షులు, సభ్యుల ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా బిషప్ ప్రకాష్ మాట్లాడుతూ...ఇలాంటి మంచి ర్యాలీ కార్యక్రమం ఏర్పాటు చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రస్తుతం ప్రపంచంలో నెలకొన్న క్లిష్ట పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని క్రైస్తవులందరూ ఏకమై వేలాది సంఖ్యలో తరలివచ్చి శాంతి భద్రతల కోసం ప్రార్థించి ప్రభువు దీవెనలను పొందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులందరినీ అభినందించారు. ఈ కార్యక్రమంలో రన్‌ఫర్ జీసస్ ర్యాలీ కోఆర్డినేటర్ చల్లగుండ్ల రమేష్‌బాబు, ఆర్‌సిఎం వికార్ జనరల్ ఫాదర్ శౌరి, ఐజెక్, ఆహ్వాన కమిటీ సభ్యులు పి.జెకర్యా, హెచ్‌రావు, వి. సత్యం, ఎన్ బాలస్వామి, కె. బాబురావు, జి. సంజీవరావు, బి. రమేష్‌పాల్, ఎమ్ఎస్ దేవిడ్, సామ్యూల్‌పిన్ని, జి. రత్నం ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఇరాన్‌పై దాడులకు నిరసనగా సెమినార్

ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ : ఇరాన్‌పై అమెరికాఇజ్రాయిల్ దాడులకు నిరసనగా ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా సెమినార్ నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ అధ్యక్షప్రధాన కార్యదర్శులు విజయ్, శ్రీనివాస్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29వ తేదీన ఉదయం 10గంటలకు ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్డు చౌరస్తా నందు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ముఖ్య వక్తగా హార్వెస్ట్ విద్యాసంస్థల అధినేత రవి మారుతి, మున్సిపల్ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత హాజరవుతున్నారన్నారు. ఈ కార్యక్రమానికి మేధవులు, ప్రజలు, అసోషియేషన్ కార్యకర్తలు హాజరై విజయవంతం చేయాల్సిందిగా పిలుపునిచ్చారు.

## అంగరంగ వైభవంగా
# రాములోరి కళ్యాణం
### -రామనామస్మరణతో మారుమోగిన ఆలయాలు






ప్రజాపక్షం/ఖమ్మం అర్బన్ : లోక కళ్యాణంగా భావించే శ్రీ సీతారాముల కళ్యాణం ఖమ్మం నగరంలో పలు ఆలయాల్లో అంగరంగ వైభవంగా నిర్వహించారు. రామనామ స్మరణతో భక్తులు పరవసించిపోయారు. శుక్రవారం శ్రీరామ నవమి సందర్భంగా ఖమ్మం నగరంలో వాడవాడలా శ్రీ సీతారాముల కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో శ్రీ రాముల వారు సీతమ్మ తల్లి మెడలో మాంగళ్యధారణ చేశారు. శ్రీ సీతారాముల కళ్యాణ వైభవాన్ని భక్తులకు ప్రవచకులు వివరించారు. కళ్యాణ అనంతరం స్వామి తలంబ్రాల వేడుకను తిలకించేందుకు భక్తులు ఆసక్తి కనబరిచారు. మేళతాళాలతో స్వామి వారికి పట్టు వస్త్రాలను సమర్పించారు. నగరంలోని ఖమ్మం నగరంలోని ఇందిరా నగర్ పర్ణశాల వద్ద గల శ్రీ సీతారామ చంద్ర స్వామి దేవస్థానం నందు శ్రీ సీతారామ చంద్ర స్వామి వారి కళ్యాణాన్ని భద్రాద్రి తరహాలో వేదపండితుల మంత్రోచ్చరణ, భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. స్వామి వారి కళ్యాణంతో పాటు ముత్యాల తలంబ్రాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. పర్ణశాల వద్ద కళ్యాణం అనంతరం ముత్యాల తలంబ్రాలను భక్తులకు పంపిణీ చేశారు. గాంధీచౌక్‌లో, ట్రంక్ రోడ్డులో, ఎన్నెస్పి రామాలయంలో, స్టేషన్ రోడ్డు, వీడియోస్ కాలనీలోని రామాలయం, కమాన్ బజార్‌లోని ఆంజనేయ ఆలయం, జలాంజనేయ స్వామి, పాండురంగాపురం రామాలయం, ఖానాపురం బాలాజీ నగర్ రామాలయం, యుపిహెచ్ కాలనీ అభయ వెంకటేశ్వర స్వామి ఆలయంలో, కొత్తగూడెం, రుద్రమ్మకోట, గోపాలపురం ఆలయాల్లో, రంగనాయకుల గుట్ట, బుర్హాన్ పురం ఆంజనేయ స్వామి, మామిళ్లగూడెంలోని రామాలయంతో పాటు పలు ఆంజనేయ స్వామి ఆలయాలు, ఇతర ఆలయాల్లో సీతారాముల కళ్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణలతో భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. కళ్యాణ అనంతరం భక్తులకు పానకం, వడపప్పుతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా పలు ఆలయాల వద్ద స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో పానకం, మజ్జిగ, మంచి నీటిని భక్తులకు అందజేశారు. ముస్లిం యువత శ్రీ సీతారామ చంద్రస్వామి కళ్యాణం సందర్భంగా పానకం, మజ్జిగ, విసనకర్రలను పంపిణీ చేశారు. శ్రీరామ నవమి సందర్భంగా ఖమ్మం నగరంలో ఏ వీధి చూసినా భక్తులతో కిటకిటలాడాయి. ప్రతి ఇంట పండుగ వాతావరణం నెలకొంది. పలు ప్రాంతాల్లో స్వామి వారికి ఊరేగింపు నిర్వహించారు. శ్రీరామ నవమి సందర్భంగా ఖమ్మం నగరంలో పలు ఆలయాలను మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తనయుడు తుమ్మల యుగంధర్, ఎఎంసి ఛైర్మన్ యరగర్ల హన్మంతరావు, కాంగ్రెస్ నగర అధ్యక్షులు నాగండ్ల దీపక్ చౌదరి తదితరులు సందర్శించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి కళ్యాణాన్ని తిలకించారు.

## ఘనంగా శ్రీ సీతారాముల కళ్యాణం





ప్రజాపక్షం/ రఘునాథపాలెం : శ్రీరామ నవమి సందర్భంగా శ్రీ సీతారాముల కళ్యాణం భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. శుక్రవారం శ్రీరామ నవమిని పురస్కరించుకుని రఘునాథపాలెం మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో శ్రీ సీతారాముల కళ్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ భక్తజన సందోహం మధ్య ఘనంగా నిర్వహించారు. అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణాన్ని పండితులు నిర్వహించారు. స్వామి వార్లకు పట్టు వస్త్రాలతో పాటు ముత్యాల తలంబ్రాలను తీసుకు వచ్చారు. రామనామ స్మరణతో కళ్యాణ మండపాలన్ని మారుమ్రోగాయి. ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కళ్యాణాన్ని తిలకించేందుకు వచ్చిన భక్తులకు పానకం, వడపప్పు పంపిణీ చేశారు. వి. వెంకటాయపాలెం గ్రామంలో శ్రీ సీతారామచంద్ర స్వామి ఆలయంలో రాముల వారి కళ్యాణాన్ని వైభవోపేతంగా నిర్వహించారు. వినాయక గుడి వద్ద ఘనంగా నిర్వహించారు. పలు గ్రామాల్లో స్వామి వారికి ఊరేగింపు నిర్వహించారు.

## కమనీయం రమణీయం శ్రీరాముని కళ్యాణం



ప్రజాపక్షం/ఆళ్లపల్లి: మండల కేంద్రంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ ప్రాంగణంలో శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణం శుక్రవారం కన్నుల పండుగగా జరిగింది. ఆళ్లపల్లి గ్రామంలో భద్రాచలంలో లాగానే స్వామి కళ్యాణం ఐదు రోజులుగా వివాహ వేడుకలు జరుగుతాయి. ఐదు రోజుల వేడుకలలో భాగంగా గురువారం రాత్రి ఆళ్లపల్లి గ్రామ పురవీధులలో శ్రీ సీతారామ చంద్రస్వామి ఎదుర్కోలు కార్యక్రమం మహిళల కోలాటాలతో, నృత్యాలతో ఘనంగా జరిపారు. శుక్రవారం శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం అంగరంగ వైభవంగా జరిపారు. పీటల మీద కూర్చున్న దంపతులు తెలగాని సందీప్, నీలిమ దంపతులు, నరెడ్ల సాయి చందు, సుప్రీయ దంపతులు, నేరెడ్ల ప్రశాంత్, సాహిత్య దంపతులు, సురేంద్ర, స్వాతి దంపతులు ఆధ్వర్యంలో ఆచార్యులు నాగరాజు ఘనంగా కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం గౌరిశెట్టి నాగభూషణరావు, భారతమ్మ దంపతుల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రామాలయ కమిటీ సభ్యులు అబ్బు నాగేశ్వరరావు, గౌరిశెట్టి శ్రీనివాసరావు, నరెడ్ల వెంకన్న, బూరుగడ్డ రాములు, అనుమోల వెంకటేశ్వరరావు, సంకా ప్రభాకర్, నరెడ్ల శ్రీనివాస్, తెలగాని పురుషోత్తం, తెలగాని శ్రీనివాసరావు, నరేడ్ల కృష్ణయ్య, పానుగంటి నరసింహారావు, నరేడ్ల రాంబాబు, దొంగరి శోభన్, కసనబోయిన నరేష్, సిరినోముల శ్రీనివాసరావు, సిరినోముల వజ్రేశ్వరరావు, శ్రీను, వెంకన్న, నరసింహారావు, ముత్తిలింగం, శివ, సతీష్, రాజేష్, సంపత్, రంజిత్, ప్రశాంత్, సాయి, వినోద్, పండు, సదా, వెంకటేష్, గణేష్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
### కళ్యాణాన్ని తిలకించిన భక్తులు




ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ ,వైరా మండలంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా ప్రతి గ్రామంలో ప్రతిచోట నిర్వహించారు. పులిగుట్ట వద్ద జరిగిన కళ్యాణ కార్యక్రమంలో చుట్టుప్రక్కల ప్రజలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. సిరిపురం గ్రామపంచాయతీ పరిధిలోని గౌండ్లపాలెం గ్రామంలో జరిగిన సీతారామ కళ్యాణ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ శెట్టిపల్లి శ్రీనివాసరావు శాంతి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామస్థులు, బొడ్డు రామకృష్ణ దంపతులు వారిని శాలువ ఆకప్పి ఘనంగా సన్మానించారు. అనంతరం శెట్టిపల్లి శ్రీనివాసరావు ఆయన తల్లిదండ్రుల జ్ఞాపకార్థం గుడి వద్ద సొంత ఖర్చులతో ఏర్పాటు చేసిన షెడ్‌ను సర్పంచ్ శ్రీనివాసరావు ప్రారంభించారు. తాటిపూడి గ్రామంలో జరిగిన సీతారామ కళ్యాణం కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జవ్వాజి అశ్విని నాగరాజు దంపతులు, పలువురు పీటల మీద కూర్చొని సీతారామ కళ్యాణాన్ని ఘనంగా జరిపించారు. వైరాలో రామాలయం నందు కూరగాయల మార్కెట్ నందు సీతారామ కళ్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. ప్రతి ఊరిలో అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం జరిగింది.

## ఘనంగా శ్రీరామనవమి వేడుకలు
### భారీగా తరలివచ్చిన భక్తులు




ప్రజాపక్షం/సత్తుపల్లి: సత్తుపల్లి మండల వ్యాప్తంగా ఆయా ఆలయాల్లో, వీధుల్లో చలువ పందిళ్ళ నీడలో ఘనంగా సీతా రాముల కళ్యాణ వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి. 61 సంవత్సరాల ఘన చరిత్ర కలిగిన కిష్టారం గ్రామంలోని శ్రీ కోదండ రామాలయంలో సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేద పండితులు మంత్రాలతో కళ్యాణ వేడుకను కన్నుల విందుగా నిర్వహించారు. సీతారాముల కళ్యాణ తంతును సింగరేణి సత్తుపల్లి ఏరియా జనరల్ మేనేజర్ చింతల శ్రీనివాస్ లక్ష్మి దంపతులు నిర్వహించారు. అదే విధంగా పట్టణంలోని మెట్ట ఆంజనేయ స్వామి ఆలయం, కోదండ రామ స్వామి ఆలయం, గుడిపాడు,అయ్యగారిపేట, బేతుపల్లి, తుమ్మూరు, గంగారం, సిద్దారం, సదాశివునిపాలెం తదితర గ్రామాలలో సీతారాముల కళ్యాణ వేడుకలు అంభరాన్నంటాయి. సీతారాములోరి కళ్యాణాన్ని తిలకించేందుకు భక్తులు భారీగా తరలిరావడంతో ఆలయాలు కిట, కిటలాడాయి. కళ్యాణం అనంతరం హాజరైన్న భక్తులకు ఆయా ఆలయాల కమిటీల ఆధ్వర్యంలో మహా అన్నదాన కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

## ఘనంగా శ్రీ సీతారామచంద్రస్వామి కళ్యాణం



ప్రజాపక్షం/ఎర్రుపాలెం : తెలంగాణ తిరుపతిగా ప్రసిద్ధిగాంచిన జమలాపురం శ్రీ వెంకటేశ్వరస్వామి వారి ఆలయం ప్రాంగణంలోని వకుళమాత స్టేడియంలో శ్రీరామ నవమి పర్వదినం సందర్భంగా శ్రీ సీతారామచంద్రస్వామి వారి కళ్యాణ మహోత్సవాన్ని అంత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రామచంద్రస్వామిని వరునిగా, సీతమ్మ తల్లిని వధువుగా పూజించి దేవస్థానం తరుపున ఉప్పల వెంకటసీతారామాంజనేయశాస్త్రి, హైమావతి దంపతులు కన్యాదాతలుగా ఉప్పల విజయదేవశర్మ సీతమ్మను సమర్పించారు. బ్రహ్మశ్రీ పురాణం రవికుమార్‌శర్మ శాస్త్రంగా సీతారామ కళ్యాణం నిర్వహించారు. ఆలయ ఈఓ కొత్తూరు జగన్మోహన్‌రావు, తుళ్లూరు కోటేశ్వరరావు, నిర్మలకుమారి దంపతులు శ్రీవారి తరుపున పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సమర్పించారు. శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణ మహోత్సవం రమణీయంగా ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా దేవస్థానం ప్రధాన అర్చకులు శ్రీనివాస్‌శర్మ వ్యాఖ్యానం భక్తులను పరవశింపచేసింది. అనంతరం భక్తులకు పానకాన్ని పంపిణీ చేశారు. ఆతర్వాత గ్రామసేవగా హనుమంతుని వాహనంపై సీతారామచంద్రస్వామి వార్లను ఊరేగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, పెద్ద ఎత్తున భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం

ప్రజాపక్షం/అన్నపురెడ్డిపల్లి: అన్నపురెడ్డిపల్లి గ్రామంలో శ్రీ సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించబడింది. గ్రామంలోని శ్రీరామాలయంలో జరిగిన ఈ మహోత్సవంలో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ప్రధాన అర్చకులు ప్రసాదాచార్యులు ఆధ్వర్యంలో వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల దివ్య కళ్యాణం కన్నులపడువగా సాగింది. భక్తి జనం చెక్క భజన బృందాలతో ఆలయ ప్రాంగణం కోలాహలంగా మారింది. గ్రామం మొత్తం పండుగ వాతావరణంలో కళకళలాడింది.వేద పండితులు సీతారాముల కళ్యాణ ఘట్టాన్ని భక్తులకు అర్థమయ్యేలా ప్రవచనం చేశారు. మండలంలోని అబ్బుగూడెం, రాజాపురం, మర్రిగూడెం వివిధ గ్రామాలలో కన్నుల పండువగా సీతారాముల కళ్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించగా, సాంప్రదాయ భజనలు, హారతులు కార్యక్రమాన్ని మరింత భక్తిమయంగా తీర్చిదిద్దాయి. ఈకార్యక్రమం గ్రామస్తుల ఐక్యతను, భక్తిని ప్రతిబింబించేలా నిలిచింది. ఈకార్యక్రమంలో గ్రామ పెద్దలు రామాలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




## ఘనంగా రాములోరి కళ్యాణం



ప్రజాపక్షం/ములకలపల్లి: ములకలపల్లి మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో రాములోరి కళ్యాణం ఘనంగా నిర్వహించారు. నరసాపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన రామ మందిరం నందు బజ్జూరి నాగేశ్వరరావు, శైలజ దంపతులు స్వామి వారి కళ్యాణం నిర్వహించారు. ఈకార్యక్రమంలో గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

## మణుగూరుకు చేరుకున్న సేవ్ సింగరేణి పోరుజాత



ప్రజాపక్షం/మణుగూరు: సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) రాష్ట్ర వ్యాప్తంగా జరుగు బస్సు యాత్ర సేవ్ సింగరేణి పోరు జాత శుక్రవారం మణుగూరు కు చేరుకొని పెద్ద ఎత్తున బొగ్గు గనుల వద్ద, జిఎం కార్యాలయం నందు, మీటింగ్ అనంతరం బైక్ ర్యాలీ అంబేద్కర్ సెంటర్ వరకు పెద్ద ఎత్తున కొనసాగింది. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు .అనంతరం అక్కడి నుండి ఏఐటీయూసీ కార్యాలయంకు చేరుకుంది.

## గుంపెళ్లగూడెంలో సేవా స్ఫూర్తి
### -వృద్ధ మహిళకు రూ 5వేల సాయం



ప్రజాపక్షం/కారేపల్లి: మండల పరిధిలోని గుంపెళ్ల గూడెం గ్రామంలో ఎంప్లాయిస్ గ్రూప్ సభ్యులు మరో సారి మానవత్వాన్ని చాటుకున్నారు. గ్రామానికి చెందిన బానోత్ మిటి అనే వృద్ధ మహిల ప్రమాదవశాత్తు పడిపోవడంతో ఎడమ కాలు విరిగి శస్త్ర చికిత్స చేయించుకోవాల్సి వచ్చింది. రోజు వారీ కూలీ పనులపై ఆధారపడి జీవనం సాగించే ఆమె కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయం తెలుసుకున్న గుంపెళ్లగూడెం ఎంప్లాయిస్ గ్రూప్ సభ్యులు వెంటనే స్పందించి రూ 5వేలను ఆర్థిక సహాయం అందజేశారు. ఈకార్యక్రమంలో బానోత్ వీరన్న, బానోత్ రాంబాబు, గుగులోత్ శంకర్, బానోత్ రమేష్(ఆర్మీ), బానోత్ శంకర్ పాల్గొన్నారు. కష్టాల్లో ఉన్న వారికి సహాయం చేయడం సామాజిక బాధ్యత అని వారు తెలిపారు. గ్రామంలో ఇలాంటి సేవా కార్యక్రమాలు కొనసాగాలని గ్రామ ప్రజలు అభినందించారు.

## భక్తులకు పులిహోర, మజ్జిగ పంపిణీ

ప్రజాపక్షం/బూర్గంపాడు : శ్రీరామ నవమి సందర్భంగా భద్రాచలం శ్రీ సీతారామ కళ్యాణ మహోత్సవానికి విచ్చేసిన భక్తులకు బూర్గంపాడు మండలం సారపాక గ్రామానికి చెందిన ముస్లిం ఎంపవర్మెంట్ వెల్ఫార్ అసోసియేషన్(మేవా)కమిటీ ఆధ్వర్యంలో పులిహోర, మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. సుమారు 3వేల పులిహోర, మజ్జిగ ప్యాకెట్లను భక్తులకు అందజేసి వేసవి వేడిలో ఉపశమనం కలిగించారు. భద్రాచలం నుంచి తిరుగు ప్రయాణంలో ఎండ తీవ్రతను దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక సేవా కేంద్రం ఏర్పాటు చేసి ప్రతి భక్తుడికి ఒక పులిహోర ప్యాకెట్, ఒక మజ్జిగ ప్యాకెట్ అందజేశారు. ఈకార్యక్రమాన్ని సారపాక సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ హిందూ, ముస్లిం సామాజిక సామరస్యానికి ఇది గొప్ప ఉదాహరణ అని అన్నారు. మతాలకు అతీతంగా ముస్లిం సోదరులు భక్తులకు సేవ చేయడం అభినందనీయమని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో ఐఎన్‌టియూసి రాష్ట్ర నాయకులు మారం వెంకటేశ్వరరెడ్డి, ఉప సర్పంచ్ కన్నెదారి రమేష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు మహమ్మద్ ఖాన్, మేవా కమిటీ సభ్యులు మహమ్మద్ ముస్తఫా, షేక్ జహీర్ పాషా, అజీమ్ భాయ్, అబ్దుల్ సలీం, హాఫీజ్, అక్బర్, సోహెల్ పాషా, యూసుఫ్, అజీజ్, రెహమాన్, తదితరులు పాల్గొన్నారు.

# పుష్కరాల నాటికి ఆలయ తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి

## - దేవాదాయ మంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/భద్రాచలం :** గోదావరి పుష్కరాల నాటికి ఆలయ తొలిదశ అభివృద్ధి పనులు పూర్తి చేస్తామని రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖా మంత్రి కొండా సురేఖ తెలిపారు. శుక్రవారం సీతారాముల కళ్యాణ మహోత్సవం అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. భద్రాచలంలోని రాముల వారి కళ్యాణానికి ఎంతో ప్రాముఖ్యత ఉందని, దేశవ్యాప్తంగా కోట్లాది మంది ప్రజలు శ్రీ సీతారామచంద్ర స్వామి కళ్యాణాన్ని వీక్షించారని చెప్పారు. ప్రజాప్రభుత్వం ఏర్పడిన తర్వాత మూడవ సం. మంత్రిగా తానూ కళ్యాణ మహోత్స వేడుకల్లో పాల్పంచడం సంతోషంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాచలం ఆలయాభివృద్ధి చేయాలనే లక్ష్యంతో డిప్యూటీ సిఎం, స్థానిక మంత్రి సహకారంతో స్థానికంగా అవసరమైన భూ సేకరణ చేసిన తర్వాత రాబోయే సంవత్సరం గోదావరి పుష్కరాలు జరుగుతున్న నేపథ్యంలో మొదటి విడత క్రింత భద్రాచలం ఆలయానికి రూ.351 కోట్లతో చేపట్టిన అభివృద్ధిపనులకు భూమి పూజ చేసుకున్నట్లు చెప్పారు. గోదావరి పుష్కరాల సమయానికి ప్రస్తుతం చేపట్టిన అభివృద్ధి పనులకు చేసేందుకు దేవాదాయ శాఖ కృషి చేస్తుందని అన్నారు. తర్వాత రెండో విడత నిధులు విడుదల చేసుకుని కృష్ణపుష్కరాల నాటికి అభివృద్ధి పనులు పూర్తి చేయడం జరుగుతుందని మంత్రి తెలిపారు. నేడు కళ్యాణ మహోత్సవాన్ని తలకించిన భక్తులందరికీ రామచంద్ర స్వామి ఆశీస్సులు ఉండాలని, ప్రజాప్రభుత్వానికి రామచంద్రమూర్తి శక్తిని కల్పించి ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అశీర్వదించాలని మంత్రి కోరారు.

# అంగరంగ వైభవంగా సీతారాముల కళ్యాణం



**ప్రజాపక్షం/కొణిజర్ల :** మండలంలోని తనికెళ్ల, కొణిజర్ల, అమ్మపాలెం, లాలాపురం, పెద్దమునగాల గ్రామాలతోపాటు అన్ని గ్రామాల్లో వాడవాడనా శ్రీ సీతారామకళ్యాణం ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామాల్లో పండుగ వాతావరణం నెలకొంది. తనికెళ్లలో శ్రీ సీతారాముల కళ్యాణం గరికపాటి రాజారావ్ కళామందిర్. బిసి కాలనీలో సీతారాముల కళ్యాణం ఘనంగా నిర్వహించారు. గరికపాటి రాజారావ్ కళామందిర్ వద్ద పీటలపై పిన్నం రాంబాబు, పసుమర్తి సత్యనారాయణ, గడల నరసింహారావు, బొడ్డు కృష్ణ దంపతులు కూర్చుని కళ్యాణం జరిపించారు.బిసి కాలనీలో సీతారాముల కళ్యాణానికి పట్టు వాస్త్రాలు తలంబ్రాల బియ్యాన్ని గుమ్మిడెల్లి బంగారయ్య సమర్పించుకున్నారు. తలంబ్రాలు బియ్యాన్ని గ్రామానికి చెందిన షేక్ హుస్సేన్ అనే ముస్లిం తోపాటు కుచిచేటి రాజకిషోర్, పెంటికల వెంకటేశ్వర్లు, కోళ్లూరి విశ్వనాథం, పసుమర్తి నాగేంద్రబాబు సమర్పించుకున్నారు. ముత్యాలు తలంబ్రాలు లేడిబోయిన సాయి దంపతులు సమర్పించుకున్నారు. పీటలమీద కురిచేటి రాజకిషోర్ దంపతులు, పసుమర్తి నాగేంద్రబాబు దంపతులు, కోళ్లూరి విశ్వనాథం దంపతులు కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. కళ్యాణం తిలకించడానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. కళ్యాణ ఘట్టాన్ని నరసింహశాస్త్రి, రాంబాబు వేదపండితులు జరిపించారు. కళ్యాణాన్ని ఎందుకు జరిపించాలి అనే విషయాన్ని భక్తులకు విశదీకరించారు. కమిటి సభ్యులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు పూర్తి చేశారు. కళ్యాణం అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంచిపెట్టారు. సాయంత్రం గ్రామాల్లో స్వామి వారి చిత్రపటాలు, ఉత్సవ విగ్రహాలను ఊరేగింపు నిర్వహించారు.

# కమనీయం రమణీయం సీతారాముల కళ్యాణం





**ప్రజాపక్షం/ తిరుమలాయపాలెం :** శ్రీరామనవమి సందర్భంగా సీతారాముల కళ్యాణం మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఎంతో ఘనంగా భక్తులు నిర్వహించారు. సీతారాముల కళ్యాణం కోసం బచ్చోడు గ్రామంలో నూతనంగా నిర్మించిన దేవాలయంలో సీతారాముల కళ్యాణం అత్యంత ఘనంగా నిర్వహించారు. పచ్చటి తోరణాలతో అలంకరించిన ఆలయ ప్రాంగణంలో సీతారాముల కళ్యాణాన్ని రామసహాయం అరవింద్‌రెడ్డి హరితారెడ్డిలు పీటల మీద కూర్చొని కళ్యాణాన్ని జరిపించారు. నూతనంగా నిర్మించిన దేవాలయంలో బుధవారం విగ్రహ ప్రతిష్ట నిర్వహించినంతరం నవమి రావడం సీతారాముల కళ్యాణాన్ని జరుపుకోవడం అక్కడ ప్రజల అదృష్టంగా భావిస్తున్నారు. మంగళవాయిద్యాలతో వేదపండితులతో వేదమంత్రాల నడుమ అభిజిత్ లగ్నంలో సీతారాముల కళ్యాణం ఎంతో కమనీయం రమణీయంగా సాగించి ఈ కళ్యాణానికి గ్రామంలో మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో కళ్యాణాన్ని తిలకిస్తూ రామనామసర్మణతో ఆలయ ప్రాంగ ణం మారుమోగింది. ప్రతి సంవత్సరం నవమి రోజున సీతారాముల కళ్యాణం జరుపుకోవటం పూర్వం నుండి అనవాయితీగా వస్తుంది. మారుతున్న కాలంతో పాటు సాంకేతిక పరిజ్ఞానం రోజు రోజుకి వృద్ధి చెందుతున్న ప్రస్తుత రోజుల్లో కూడా ఆనవాయితీ ప్రకారం ప్రజలు సీతారాముల కళ్యాణాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం విశేషం. అనంతరం అన్నదాన కార్యక్రమాలు గ్రామాల్లోని పురవీధుల్లో సీతారాముల విగ్రహాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, రాజకీయ ప్రముఖులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

# నూతి సత్యనారాయణ తేనేటి విందులో పాల్గొన్న మంత్రి వాకాటి శ్రీహరి

## మంత్రి శ్రీహరికి ఘనస్వాగతం పలికిన నూతి దంపతులు







**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర మంత్రి వాకాటి శ్రీహరి జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణగౌడ్ నివాసం నందు జరిగిన తేనేటి విందు కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టివిక్రమార్క సతీమణి నందిని పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కాంగ్రేస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ గౌడ్, విజయలక్ష్మి దంపతులు మంత్రి శ్రీహరికి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. అనంతరం మల్లు నందిని విక్రమార్కకు నూతి సత్యనారాయణ సతీమణి నూతి విజయలక్ష్మి మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ, కౌన్సిలర్లు వేముల శ్రావణి, ముళ్లపాటి విజయతో కలిసి సంప్రదాయబద్ధంగా నుదుటి తిలకం దిద్ది వస్త్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ అధ్యక్షులు డాక్టర్ కాపా మురళీ కృష్ణ, జిల్లా కాంగ్రేస్ మాజీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, రంగా జనార్ధన్ రావు, మండల కాంగ్రేస్ అధ్యక్షుడు శీలం వెంకటనర్సిరెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు శీలం చంద్రశేఖర్‌రెడ్డి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ ముళ్ళపాటి సీతారాములు, వుంద్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, పమ్మి అశోక్, వీరంశెట్టి సీతారాములు, లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, మిట్టపల్లి శ్రీనివాసరావు, గంగవరపు కిషన్, తోటకూర శ్రీకాంత్, ఉయ్యూరు రామకృష్ణ, పోలూరు సైదులు తదితరులు పాల్గొన్నారు.

# ముఖ్యమంత్రికి ఘన స్వాగతం





**ప్రజాపక్షం/భద్రాచలం :** శ్రీ సీతారాముల కళ్యాణ వేడుకకు హాజరైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్కకు జిల్లా కలెక్టర్ అంకిత్, ఎస్‌పి రోహిత్ రాజ్ ఘన స్వాగతం పలికారు. ఐటిసి పిఎస్‌పిడి ఆవరణలో సిద్ధం చేసిన హెలీప్యాడ్ వద్దకు చేరుకున్న వారికి పుష్పగుచ్చాలు అందించారు. అనంతరం పోలీస్‌లు గౌరవ వందన సమర్పణ చేశారు. అక్కడి నుండి ప్రత్యేక వాహనాల్లో భద్రాచలం రామాలయానికి చేరుకున్నారు. ఆలయంలోని గర్భగుడిలో సతీసమేతంగా పూజలు నిర్వహించి స్వామివారి కళ్యాణ తంతుకు హాజరయ్యారు.

# మల్లు నందినికి సన్మానం





**ప్రజాపక్షం/వైరా:** తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సతీమణి అమ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు నందిని విక్రమార్కను వైరా మున్సిపల్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా చంద్రకళ మురళీకృష్ణ వైరాలో నూతి సత్యనారాయణ నివాసం నందు మర్యాదపూర్వకంగా స్వాగతం పలికి శాలువా కప్పి సన్మానించారు. ఈ సన్మాన కార్యక్రమంలోమున్సిపల్ కౌన్సిలర్లు ముళ్ళపాటి విజయ,వేముల శ్రావణి, జిల్లా కాంగ్రేస్ మెడికల్ అండ్ హెల్త్ చైర్‌పర్సన్ డాక్టర్ కాపా మురళీకృష్ణ, ముళ్ళపాటి సీతారాములు, వుంద్రు శ్యామ్‌బాబు, వేముల రత్నాకర్, గంగవరపు కిషన్,తోటకూర శ్రీకాంత్ తదితరులు ఉన్నారు.

# సిసి రోడ్డు పనులకు శంకుస్థాపన



**ప్రజాపక్షం/ బోనకల్ :** బోనకల్ మండలంలోని గోవిందాపురం(ఎ) గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో నూతన సిసి రోడ్డు పనులకు గ్రామసర్పంచ్ ఇసరం కరుణ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీని ప్రజా ప్రభుత్వంలో డిప్యూటీ సిఎం మల్లు భట్టివిక్రమార్క చొరవతో ప్రజలకు అవసరమైన మౌలిక వసతులు కల్పన కృషి చేయటం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపిటిసి భాగం రమేష్, పాపారావు, రాయప్ప, రాజేంద్ర, గుండపునేని రాజేంద్రబాబు, బాగం రాధాకృష్ణమూర్తి, కావూరి శంక్రరావు ఆనుబోతు శ్రీను, షేక్.నాగుల్‌మీరా తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు ట్రై సైకిళ్లు పంపిణీ



**ప్రజాపక్షం/ బోనకల్ :** మండల పరిధిలోని ఆళ్ళపాడు గ్రామంలో దివ్యాంగుల పట్ల మానత్వాన్ని చాటుతూ గ్రామ సర్పంచ్ తెల్లబోయిన నాగేశ్వర రావు ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దివ్యాంగులైన పదిలం వీరమ్మ, దొంతబోయిన రమాదేవిలకు ట్రై సైకిళ్లు అందచేసి వారి దైనందిన జీవనాన్ని సులభతరం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బండి సైదమ్మ, నాల్గొవ వార్డు మెంబర్ షేక్.చాంద్‌సాహెబ్, ఐదవ వార్డు మెంబర్ అల్లిక కబ్బయ్య, ఆరవ వార్డు మెంబర్ చిన్న కిరణ్, షేక్ రేష్మ, వివిధ పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా వాడవాడల శ్రీరామనవమి వేడుకలు





**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చంద్రుగొండ మండలంలోని పలు గ్రామాల్లో శ్రీరామనవమి వేడుకలు భక్తి శ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. చంద్రుగొండలోని ఆంజనేయ స్వామి, మహాలక్ష్మి అమ్మవారు, సాయి బాబా ఆలయాల వద్ద వేద పండితులు విప్పర్ల వేణు అయ్యగారి ఆధ్వర్యంలో వేద మంత్రాల మధ్య శ్రీరామనవమి వేడుకలు శుక్రవారం వైభవంగా నిర్వహించారు. అంబేద్కర్‌నగర్ కాలనీతో పాటు తిప్పనపల్లి, రాయకంపాడు, పోకలగూడెం, గానుగపాడు, మద్దుకూరు, అయ్యన్నపాలెం, బెండలపాడు గ్రామాల్లో ప్రత్యేకంగా పందిళ్లు ఏర్పాటు చేసి శ్రీ సీతారామచంద్ర స్వామివారి కళ్యాణ మహోత్సవాలను నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై జై శ్రీరామ్ నినాదాలతో వేడుకల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ కమిటీ నిర్వాహకులు సంక కృపాకర్, కేసరి కిరణ్‌రెడ్డి, సర్పంచ్ ఇస్లావత్ రుక్మిణి, ఉప్పతల ఏడుకొండలు, చీదర్ల పవన్ కుమార్, బుంగ శ్రీనివాస్ రావుతో పాటు పలువురు గ్రామ పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.

# ఊరూ వాడా జగదభి రాముడి కళ్యాణం

- మారుమోగిన శ్రీరామ నామాలు
- ఆధ్యాత్మిక శోభను సంతరించుకున్న పాల్వంచ
- పట్టు వస్త్రాలు సమర్పించిన ఎంఎల్ఏ కూనంనేని
- పాత పాల్వంచలో కొత్వాల శ్రీనివాసరావు
- యానంబైల్ గ్రామంలో 38 డివిజన్ కార్పోరేటర్
- హాజరైన భక్తజనం



**ప్రజాపక్షం/పాల్వంచ:** పాల్వంచ భజన మందిరంలో జరిగిన రాములోరి కళ్యాణానికి ఎంఎల్ఏ కూనంనేని సాంబశివరావు చేతుల మీదుగా పట్టు వస్త్రాలను అందజేశారు. పాల్వంచ మండల వ్యాప్తంగా ఊరూ, వాడా ఆధ్యాత్మిక శోభను సంతరించుకొన్నాయి. శ్రీరామ నవమి సంధర్భంగా గ్రామాలు, పట్టణ పరిధి వివిధ డివిజన్‌లో రామయ్య కళ్యాణాన్ని అత్యంత వైభవోపేతంగా జరిపించారు. మండల పరిధి మల్లారం, ఉల్వనూర్, మందెరికలపాడు, యానంబైల్, సోముల గూడెం, దంతెలబోర, పాండురంగాపురం తదితర గ్రామాలతో పాటుగా పాల్వంచ పట్టణం లోని భజన మందిరం, బొల్లోరిగూడెం, సీతారామపట్నం, విద్యుత్ కాలనీ, జ్యోతి నగర్, బాపూజీ నగర్, కేటిపిఎస్ సి కాలనీ సమీపం లోని ఆంజనేయస్వామి దేవాలయం, గట్టాయి గూడెం ఆంజనేయస్వామి, పాత పాల్వంచ ఆంజనేయస్వామి ఆలయం, ఆయ్యప్పస్వామి దేవాలయం, ఇందిరా కాలని, హమాలి కాలనీ, పేట చెరువులలోని ఆలయాలతో పాటుగా వివిధ కాలనీలలో రామయ్య కళ్యాణం వైభవోపేతంగా జరిపించారు. పాల్వంచ భజన మందిరంలో జరిగిన రాములోరి కళ్యాణానికి ప్రతీ సంవత్సరం హైదరాబాద్‌కు చెందిన సాయిక్రిష్ణ మోహన్ తమిళనాడు నుండి ప్రత్యేక పట్టు వస్త్రాలు పంపిస్తారు. పాల్వంచకు చెందిన స్వేతా ఈవెంట్స్, సమంగళి జ్యూవెలర్స్ వారు తలంబ్రాలు సమర్పించారు. పట్టు వస్త్రాలను ఎంఎల్ఏ కూనంనేని చేతుల మీదుగా అందజేశారు. పాత పాల్వంచలో జరిగిన రాములోరి కళ్యాణంలో యానంబైల్ గ్రామంలో కొత్తగూడెం మునిసిపల్ కార్పోరేషన్ పాల్వంచ 38వ, డివిజన్ కార్పోరేటర్ బత్తుల మధుచంద్ దంపతుల చేతుల మీదుగా రామయ్య కళ్యాణం జరిపించారు. కళ్యాణ క్రతువు జరిగే సమయంలో భక్తులు శ్రీరామ నామాలను జపిస్తూ పులకరించి పోయారు. ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎన్. రజనీ కుమారి నేతృత్వంలో ఆలయ ధర్మకర్తల మండల మాజీ చైర్మన్ కొత్తా వెంకటేశ్వరరావు, చంఆబర్ ఆఫ్ కామర్స్ మాజీ కన్వీనర్ చలవాది ప్రకాష్‌ల ఆధ్వర్యంలో భారీ ఎత్తున నిర్వహించిన భజనమందిర్‌లో వేద పడితులు ఆనందా శర్మచార్యులు, వంశీచార్యులచే వేదమంత్రాలతో అత్యంత వైభవోపేతంగా, కన్నుల పండువగా రామయ్య కళ్యాణాన్ని జరిపించారు. అనంతరం సుమారు పది వేయల మంది భక్తులకు అన్న ప్రసాదాన్ని అందజేశారు.

**ఉత్సవాలు ఐక్యతకు మారుపేరు :** ఉత్సవాలు కులమతాలకు అతీతంగా ప్రజల మద్యన ఐక్యతను పెంపొందిస్తాయని ఎంఎల్ఏ కూనంనేని అన్నారు. పండుగల విశిష్టతలను ప్రతీ ఒక్కరు తెలుసుకొని వాటిని ఆరించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే. సాబీర్‌పాషా, కార్పోరేటర్లు అడుసుమిల్లి సాయిబాబ, వీసంశెట్టి విశ్వేశ్వర రావు, గుర్రం వెంకటేశ్వర్లు, నామా కీర్తి, గొర్లె అన్నపూర్ణ, మల్లెల స్వప్న కుమారి, దోమల కిషోర్, లక్ష్మిపతి, గడ్డం గురువయ్య, ఆలయ సేవాదళ్ సభ్యులు బచ్చు శ్రీనివాస్, గూడెపు శ్రీనివాస్, మాలె రాజేష్, నరసింహకుమార్, మిట్టపల్లి నరసింహకుమార్, నామా పండు, నవీన్, సీతారామ పట్నం ఆలయ చైర్మన్ పోటు శ్రీనివాసరావు, బూరుగుపల్లి ప్రసాద్, తొర్తి వేణు, లింగం వీరభద్రం, తూము రాము తదితరులు పాల్గొన్నారు.







# కన్నుల విందుగా సీతారాముల కళ్యాణం..



**ప్రజాపక్షం/జూలూరుపాడు:** జూలూరుపాడు మండల వ్యాప్తంగా సీతారాముల కళ్యాణం అభిజిత్ లగ్నంలో అత్యంత వైభవంగా కన్నుల పండువగా చేశారు. వేలాది మంది భక్తులు నడుమ అర్చకులు సీతారాముల శిరస్సులపై జీలకర్ర బెల్లం ఉంచి కళ్యాణ తంతును శాస్రోక్తంగా నిర్వహించడంతో భక్తులు పులకించిపోయారు. ఈ దివ్యమైన వివాహ్ వేడుక భక్తి పారవశ్యంతో సాగింది. తమ ఆరాధ్య దైవమైన శ్రీరాముడు సీతమ్మ తల్లిని మనువాడిన ఘట్టాన్ని చూసిన భక్తులు పులకించి తరించారు. శ్రీరామ జయరామ జయ జయ రామ అంటూ భక్తులు చేసిన జయ జయ ద్వానాలు, వేద పండితుల మంత్రోచ్ఛరణలు కళ్యాణం తంతును అధ్యంతం వర్ణిస్తూ పండితుల ప్రసంగాలు మంగళ వాయిద్యాలు వైకుంఠాన్ని తలపించాయి.

# మగువలకు నూతన లయన్స్ క్లబ్



**ప్రజాపక్షం/మణుగూరు:** లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆధ్వర్యంలో నూతనంగా లేడీస్ లయన్స్ క్లబ్ ను ఏర్పాటు చేశారు. స్థానిక సత్యభాస్కర థియేటర్ లో లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు మగువ పేరుతో 25 మంది మహిళా సభ్యులతో మణుగూరు నూతన లేడీస్ క్లబ్ అధ్యక్షురాలుగా వన్నం నాగదేవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సెక్రటరీగా మేదరమెట్ల లక్ష్మి, ట్రెజరర్ గా గాజుల నాగేశ్వరి లచే 320 ఈ లయన్ డిస్ట్రిక్ట్ గవర్నర్ మదన్మోహన్ రేపాల పదవి ప్రమాణ స్వీకారంచేయించారు. ప్రమాణ స్వీకారం తర్వాత క్లబ్ అధ్యక్ష, కార్యదర్సులు మాట్లాడుతూ సమాజంలోని నిరుపేద మహిళలకు ఆరోగ్యపరమైన, విద్యార్థినులకు విద్యకు సంబంధించిన వాటికి తమ సహాయ సహకారాలు ఎప్పుడూ అందిస్తామన్నారు. అన్ని రంగాలలో ముందు ఉంటున్న మహిళలు సమాజసేవలో కూడా ముందుకు రావాలని అభిప్రాయపడ్డారు.

**తొలి రోజే రూ.25 వేల ఆర్థిక సాయం..**

తొలిసారిగా లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పడిన లయన్స్ క్లబ్ ఆఫ్ మగువ ఆధ్వర్యంలో మణుగూరులోని విఠల్ రావు లో క్యాన్సర్ తో బాధ పడుతున్న పడాల సాయి కుమార్ కుటుంబానికి 25 వేల రూపాయల నగదును లేడీస్ క్లబ్ ఏర్పాటు అయిన తొలి రోజే అందజేసి మగువల ఔదార్యాన్ని చాటారు. ఈ కార్యక్రమంలో 320ఇ డిస్ట్రిక్ట్ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ లు కాపా మురళి కృష్ణ, అమృతవల్లి కోటేశ్వర రావు, సి హెచ్. శివ ప్రసాద్, లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు చార్టర్ ప్రెసిడెంట్ పిల్లారి శెట్టి హరిబాబు, గాజుల రమేష్, గాజుల పూర్ణ చందర్ రావు, చంద్ర మోహన్, జెడ్ సి మొత్తంశెట్టి నాగేశ్వరరావు, కార్యదర్శి శ్రీనివాస్, ట్రెజరర్ నాగేశ్వర రావు, శ్రీరాములు, డాక్టర్ సమ్మయ్య, లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి, లయన్స్ క్లబ్ ఆఫ్ కొత్తగూడెం, లయన్స్ క్లబ్ ఆఫ్ వైరా, లయన్స్ క్లబ్ ఆఫ్ అశ్వాపురం లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు సభ్యులు పాల్గొన్నారు.

# కార్మికుల హక్కుల పరిరక్షణే ఎఐటియుసి ధ్యేయం



## మణుగూరులో సింగరేణి సేవ్ జాత విజయవంతం

**ప్రజాపక్షం/మణుగూరు:** సింగరేణి సంస్థ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు ఎఐటియుసి రాజీలేని పోరాటం చేస్తుందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసి అధ్యక్షులు కామ్రేడ్ వాసిరెడ్డి సీతారామయ్య, జనరల్ సెక్రెటరీ కామ్రేడ్ కొమిరి రాజ్ కుమార్ అన్నారు. సేవ్ సింగరేణి జాతాలో భాగంగా శుక్రవారం మణుగూరులోని అన్ని మైన్స్ మరియు డిపార్ట్మెంట్ల వద్ద గేట్ మీటింగ్ ల ద్వారా కేంద్ర నాయకత్వం సింగరేణిలోని వాస్తవ పరిస్థితులు, సింగరేణి సంస్థ పరిరక్షణకు ఏఐటీయూ సీ చేస్తున్న పోరాటాలను కార్మికులకు వివరించారు. సింగరేణి సంస్థ లో రాజకీయ జోక్యం ఎక్కువ అయిపోయిందని అన్నారు. సంస్థ ఆర్థిక అభివృద్ధి, మనుగడ ప్రశ్నార్ధకం అయ్యే పరిస్థితి వచ్చిందని అన్నారు, సింగరేణి ఎన్నికల్లో ఏఐటియుసి గుర్తింపు సంఘం గా గెలిచిన తర్వాత యాజమాన్యంతో స్ట్రక్చర్ సమావేశాలలో అనేక సమస్యలపై ఒప్పందం చేయడం జరిగిందని యాజమాన్యం అంగీకరించిదని కానీ వాటిని అమలు చేయకుండా అమలుకు సర్క్యులర్ ఇవ్వకుండా తాత్సర్యం చేస్తుందని వెంటనే సర్క్యులర్లు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణిలో ప్రస్తుతం ఉన్న గనులు కొంతకాలం వరకే ఉంటాయని కొత్త ప్రాజెక్టు రాకపోతే సంస్థ భవిష్యత్తు ప్రశ్నార్థకమైన పరిస్థితి ఉందని అన్నారు . సింగరేణిలో టెండర్లలలో జరిగిన అవకతవకలపై అవినీతి కార్యక్రమాలపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సింగరేణి సంస్థ రక్షణ, కార్మికుల హక్కుల పరిరక్షణ కొరకు ఏఐటీయూసీ రాజి లేని పోరాటం కొనసాగిస్తుందని కార్మికులందరూ ఈ పోరాటంలో పాల్గొని సంస్థ రక్షణకు, కార్మికుల హక్కుల పరిరక్షణకు నిరంతరం చైతన్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. సేవ్ సింగరేణి జాతాలో భాగంగా మార్చి 30వ తేదీన కొత్తగూడెం హెడ్ ఆఫీస్ ముందర పెద్ద ఎత్తున ధర్నా కార్యక్రమం, వంట వార్పు కార్యక్రమం చేపడుతున్నామని అన్నారు. సింగరేణిలోని అన్ని కార్మిక సంఘాలను పిలిచి కార్మిక వర్గం అంతా ఒకటే తాటిపైకి వచ్చి ఐక్య పోరాటాల ద్వారా ఈ సింగరేణి నీ రక్షించుకుంటామన్నారు. ఈ సమావేశాలలో ఏఐటియుసి డిప్యూటీ జనరల్ సెక్రెటరీ లు వైవి రావు, ముష్కి సమ్మయ్య, వీరభద్రరావు, ఎల్లయ్య గౌడ్, ఏఐటియూసి బ్రాంచ్ కార్యదర్శి కామ్రేడ్ వై రాంగోపాల్, వైస్ ప్రెసిడెంట్ ఎంవి రామనర్సయ్య, అసిస్టెంట్ బ్రాంచ్ కార్యదర్శి మేకల ఈశ్వరరావు, ట్రెజరర్ పుల్లారావు,ఆఫీస్ బేరర్స్ ఆవుల నాగరాజు, ఆధర్ల సురేందర్, గోలి గంగాధర్ రావు, బి సురేందర్ రావు, ఆడెపు రాజశేఖర్, సిపిఐ పార్టీ నాయకులు సరెడ్డి పుల్లా రెడ్డి, దుర్గ్యాల సుధాకర్, గడ్డం వెంకటేశ్వర్లు, మున్నా లక్ష్మి కుమారి, ఫిట్ సెక్రటరీలు కుమారస్వామి, గుంపెన శ్రీనివాస రావు, సాయి ప్రకాష్ చారి, ఈసం శ్రీనివాస రావు, బి రవి కుమార్, రత్నం, శివ, జానకి ప్రసాద్, దండు విజయ్, చొప్ప సుధాకర్, ఇమాముద్దీన్, నాగరాజు, శివ, టి. నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# మండలంలో ఘనంగా సీతారాముల కళ్యాణం

## కళ్యాణాన్ని తిలకించేందుకు హాజరైన భక్తులు



**ప్రజాపక్షం/ఏన్కూరు:** మండల వ్యాప్తంగా సీతారాముల కళ్యాణం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏన్కూరు సీతారామచంద్రలయం, టిఎల్ పేట కోదండ రామాలయం, బురద రాఘవాపురం రామాలయం, తిమ్మారావుపేట రామాలయం, నాచారం రామాలయం, ఆయా సీతారాముల కళ్యాణ మండపాల వద్ద ఉదయాన్నే మామిడి తోరణాలతో అలంకరించారు. మహిళలు సీతారాముల కల్యాణానికి బియ్యం, పసుపు, కుంకుమతో తలంబ్రాలు కలిపారు. అనంతరం ఉత్సవ మూర్తుల విగ్రహాలను ఆయా మండపాలకు చేర్చారు. వేద పండితులు పీటల మీద కూర్చున్న దంపతులతో గౌరీ పూజ చేయించి సీతారాముల కల్యాణాన్ని నిర్వహించారు. సీతారాముల కల్యాణాన్ని తిలకించేందుకు ఆయా గ్రామాల నుండి మహిళలు, పురుషులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. హాజరైన మహిళలకు, భక్తులకు వేద పండితులు తీర్థ ప్రసాదాలు అందజేశారు.

# భద్రాచలంలో సీతారాముల కళ్యాణ దృశ్యమాలిక












